

# జాతరకు వేళాయె..

- మహిమాన్విత క్షేత్రం బుగ్గరామలింగేశ్వర ఆలయం
- రేపటి నుంచి ఉత్సవాలు
- 15రోజుల పాటు జాతర
- తూర్పు నుంచి పడమరకు నీళ్లు ప్రవహించడం ఇక్కడి ప్రత్యేకత

మంచాల, నవంబర్ 13 : మంచాల మండలం ఆరుట్ల గ్రామం నుంచి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయానికి జిల్లా నుంచే కాకుండా తెలంగాణ రాష్ట్ర నలుమూలలనుంచి లక్షలాది మంది భక్తులు ఇక్కడకు తరలివస్తారు. 15 రోజుల పాటు నిర్వహించే జాతరకు భక్తులు బారీగా తరలివచ్చి రామలింగేశ్వరస్వామిని దర్శించుకుంటారు. ఉత్సవాలు కార్తిక పౌర్ణమి నుంచి అమావాస్య వరకు జరుగుతాయి. తూర్పు నుంచి పడమటికి నీళ్లు ప్రవహించి తిరిగి మళ్లీ తూర్పు వైపునకు ప్రవహించడం ఇక్కడి ప్రత్యేకత. ఇక్కడ శ్రీరాముడు ప్రత్యేకంగా శివలింగానికి పూజలు చేశాడని.. అందుకే ఈ పుణ్యక్షేత్రానికి బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంగా నామకరణం చేసినట్లు చరిత్ర చెబుతున్నది. తూర్పు నుంచి పడమటికి ప్రవహించే నీటిలో భక్తులు పుణ్య స్నానాలను ఆచరించి.. అనంతరం కార్తిక పౌర్ణమి వ్రతాలు నిర్వహిస్తారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం కుటుంబసభ్యులు బంధువులతో వంటావార్పు చేసుకుని వన భోజనాలను చేస్తారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో ఎటు చూసినా ఎత్తైన కొండలు, కోనలు.. ఎక్కడ చూసినా పచ్చని పైర్లు, ప్రశాంత వాతావరణం కనిపిస్తుంది. ఇక్కడికి వచ్చే భక్తులకు ఆహ్లాదాన్ని పంచిపెడుతుంది.

### జాతరకు ఏర్పాట్లు పూర్తి

ఆలయంలో ఈ నెల 15 నుంచి డిసెంబర్ 1 వరకు ఉత్సవాలు జరుగనున్నాయి. ఈ జాతరకు హైదరాబాద్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలతో పాటు తదితర జిల్లాల నుంచి భక్తులు తరలివస్తారు. ప్రత్యేకంగా ఒకేసారి రెండువందల మంది కూర్చొని వ్రతాలు చేసేందుకు ప్రత్యేక షెడ్డును ఏర్పాటు చేశారు. స్నానాలు చేసేందుకు అనుకూలంగా గుండం, స్నానాల అనంతరం బట్టలు మార్చుకునేందుకు గదులను ఏర్పాటు చేశారు. భక్తులు వన భోజనాలు చేయనుండటంతో వంటవార్పు కోసం ప్రత్యేక వసతులు కల్పించారు. ఆలయంలో సత్యనారాయణస్వామి వ్రతాలు చేస్తే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల విశ్వాసం. ఆలయంలో పుణ్య స్నానాల అనంతరం భక్తులంతా ఆలయం పక్కనే ఉన్న కబీర్‌దాస్ మందిరం, నాగన్నపుట్టను దర్శించుకోవడం ఆనవాయితీ.

### ఇబ్బందులు తలెత్తకుండా..



15 రోజులపాటు జరుగనున్న జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించాం. తాగు నీరు, వైద్యం తదితర సౌకర్యాలు ఉండేలా తగు ఏర్పాట్లు చేశాం. పోలీస్, విద్యుత్ శాఖల అధికారులు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నాం. వేలాదిమంది భక్తులు తరలిరానున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసేలా అన్ని శాఖలకు ఆదేశాలు జారీ చేశాం.

**- ఎంపీడీవో బాలశంకర్**

### సీసీ కెమెరాల ఏర్పాటు



జాతర బందోబస్తులో ప్రతిరోజూ 150 మంది పోలీసులతో పాటు సీఐలు, ఎస్సైలు పాల్గొంటారు. నిరంతరం సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేశాం. జాతరకు వచ్చే మహిళల పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే చర్యలు తీసుకునేందుకు షీటీం అందుబాటులో ఉంటుంది. ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపడుతున్నాం. **- సీఐ మధు**

### జాతరకు ఇలా వెళ్లాలి..

హైదరాబాద్ నుంచి ఆలయానికి చేరుకోవాలంటే ఎంజీబీఎస్ నుంచి 279, సాగర్ రింగురోడ్డు నుంచి 277 నంబర్ బస్సుల ద్వారా ఇబ్రహీంపట్నం చేరుకోవాలి. అక్కడి నుంచి 10 నిమిషాలకో ఆర్టీసీ బస్సును బుగ్గ జాతర వరకు నడిపిస్తున్నారు. నల్గొండ జిల్లా నారాయణపూర్, మునుగోడు, చౌటుప్పల్ నుంచి వచ్చే వారు నారాయణపూర్ నుంచి ఆరుట్లకు బస్సుల్లో వచ్చి అక్కడి నుంచి ఆటోలపై ఆలయానికి చేరుకోవచ్చు. మహబూబ్‌నగర్ నుంచి వచ్చేవారు కూడా ఇబ్రహీంపట్నం బస్టాండ్‌కు వచ్చి అక్కడి నుంచి ఆరుట్లకు వెళ్లే బస్సుల్లో బుగ్గ జాతరకు చేరుకోవచ్చు.

## నేడు నల్ల బ్యాడ్జీలతో నిరసన

**జిల్లా జేఏసీ చైర్మన్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శివకుమార్, అజ్మత్‌పాషా**

వికారాబాద్, నవంబర్ 13 : జిల్లా కలెక్టర్, ఇతర ఉద్యోగులపై జరిగిన భౌతిక దాడుల దృష్ట్యా గురువారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక కర్షక, పెన్షనర్లు, కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరూ నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించారని జిల్లా జేఏసీ చైర్మన్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శివకుమార్, అజ్మత్‌పాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల రాష్ట్ర జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు యావత్ తెలంగాణ రాష్ట్ర కలెక్టరేట్ కార్యాలయాల వద్ద నిరసన చేపడుతున్నామని.. ఈ కార్యక్రమంలో పాల్గొని మన ఉద్యోగుల ఐక్యత చాటాలని పేర్కొన్నారు. ఉద్యోగులందరూ మధ్యాహ్నం 12 గంటలలోపు కలెక్టర్ కార్యాలయానికి చేరుకోవాలని కోరారు.



ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధి బొంగుళూరు సమీపంలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో బీఆర్ఎస్ నాయకుడు డబ్బికార్ మధుసూదన్ కుమార్తె వివాహానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయనతోపాటు ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి తదితరులున్నారు.
- రంగారెడ్డి, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ)

## విద్యార్థులు క్రీడలతోపాటు విద్యలోనూ ముందుండాలి

**వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్**

వికారాబాద్, నవంబర్ 13 : విద్యార్థులు క్రీడలతోపాటు విద్యలోనూ ముందుండాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. బుధవారం వికారాబాద్ జిల్లాలోని శివారెడ్డిపేట (అనంతగిరిపల్లి) సాంఘిక సంక్షేమ గురుకుల బాలల పాఠశాల/కళాశాల ఆవరణలో 10వ జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులతో మాట్లాడారు. వివిధ పాఠశాలల విద్యార్థులు మార్చ్ ఫాస్ట్ ద్వారా కలెక్టర్‌కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడలతోపాటు చదువులో ముందుండాలని, క్రీడల వల్ల శారీరక దృఢత్వంతోపాటు మానసికంగా బలపడతారన్నారు. క్రీడా పోటీల్లో పాల్గొనే విద్యార్థులు గెలుపొంది జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని, క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. క్రీడల్లో తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. క్రీడల్లో రాణించినట్లయితే ఉద్యోగాల్లో ప్రాధాన్యత కల్పించడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, సాంఘిక సంక్షేమ గురుకుల బాలల పాఠశాల/కళాశాల కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, ఉమ్మడి జిల్లాల సాంఘిక సంక్షేమ గురుకుల బాలల పాఠశాలల విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

## బాలికలు సర్వతోముఖాభివృద్ధి సాధించాలి

- జిల్లా న్యాయ సేవ సాధికార సంస్థ కార్యదర్శి శ్రీదేవి
- బాలికల ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న శ్రీదేవి

ఇబ్రహీంపట్నంరూరల్, నవంబర్ 13 : రాజ్యాంగ ప్రసాదిత హక్కులు, రక్షణను ఉపయోగించుకుని బాలికలు సర్వతోముఖాభివృద్ధి సాధించాలని జిల్లా న్యాయ సేవ సాధికార సంస్థ కార్యదర్శి పొన్న శ్రీదేవి అన్నారు. బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఇబ్రహీంపట్నం బాలికల ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమెతోపాటు జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ.. అధికరణ 21-ఏ ద్వారా విద్య ప్రాథమిక హక్కుగా మారిందన్నారు. విద్యా హక్కు చట్టం కింద ప్రతిఒక్కరికీ ఉచిత నిర్బంధ విద్య అమలులో ఉందన్నారు. బాలికలు తమ లక్ష్యాన్ని చేరాలంటే ఆత్మవిశ్వాసంతో ముందడుగు చేయాలని సూచించారు. బాల్య వివాహాలు నేరమని, వీటిని ప్రోత్సహించినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

సుశీందర్‌రావు మాట్లాడుతూ.. పిల్లలకు గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ విషయాలపై పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థుల హాజరు శాతం తగ్గకుండా ఉపాధ్యాయులు కృషిచేయాలని సూచించారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సీహెచ్ రవి మాట్లాడుతూ.. పద్నాలుగు సంవత్సరాలలోపు పిల్లలతో పనులు చేయించడం నేరమన్నారు. విద్యార్థుల ఎదుగుదలకు శారీరక, మానసిక వికాసం దోహదపడుతుందన్నారు. అనంతరం పారాలీగల్ వలంటీర్లు, పాఠశాల ఉపాధ్యాయులు శ్రీదేవి, సుశీందర్‌రావులను సత్కరించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి హరియానాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లావణ్య, ఉర్దూ మీడియం ప్రధానోపాధ్యాయుడు రాధాకృష్ణ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీందర్, న్యాయవాది మహేందర్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



డెడికేటెడ్ బీసీ కమిషన్ చైర్మన్ వెంకటేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న బీసీ ఫ్రంట్ రాష్ట్ర చైర్మన్ మల్లేశ్‌యాదవ్

**రిజర్వేషన్లు పెంచిన తర్వాతే**

## ఎన్నికలు నిర్వహించాలి

**బీసీ ఫ్రంట్ రాష్ట్ర చైర్మన్ మల్లేశ్‌యాదవ్**

రంగారెడ్డి, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ) : పంచాయతీరాజ్ సంస్థల రిజర్వేషన్లను 22 శాతం నుంచి 42 శాతానికి పెంచిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ బీసీ ఫ్రంట్ రాష్ట్ర చైర్మన్ గొరిగె మల్లేశ్‌యాదవ్ అన్నారు. బుధవారం డెడికేటెడ్ బీసీ కమిషన్ చైర్మన్ భూసాని వెంకటేశ్వర్‌రావును రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లేవ్‌యాదవ్ మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం నియమించిన డెడికేటెడ్ బీసీ కమిషన్‌కు విస్తృతమైన, న్యాయపరమైన, రాజ్యాంగపరమైన అధికారాలున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర కులగణన చేసి దాని ప్రకారం బీసీ రిజర్వేషన్లు పెంచితే న్యాయపరమైన, చట్టపరమైన అవరోధాలు ఉండవన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 50 శాతం సీలింగ్ పెంచకుండా తప్పించుకోవడానికి వీలులేదన్న అగ్రకులాలకు 10 శాతం రిజర్వేషన్లు పెట్టి 50 శాతం సీలింగ్‌పై పార్లమెంటు రాజ్యాంగ సవరణ చేసింది. అగ్రకులాలకు రిజర్వేషన్లు పెంచడానికి మూడు రోజుల్లో లోక్‌సభ, రాజ్యసభలో రాజ్యాంగ సవరణ చేసి రాష్ట్రపతి సంతకం చేశారని, కాని 50 శాతం జనాభాగల బీద కులాలకు రాజ్యాంగ సవరణ చేయాలన్నారు. అసెంబ్లీలో చట్టం చేసి 42 శాతం రిజర్వేషన్లు పెంచాలన్నారు. అవసరమైతే అన్ని పార్టీలు సహకరించడానికి సిద్ధంగా ఉన్నాయని ఆయన తెలిపారు.

## ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

**రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి**



ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అధికారులకు సూచిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఆదిబట్ల, నవంబర్ 13 : ధాన్యం సేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో కలెక్టర్ ధాన్యం కొనుగోలుపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా వ్యవసాయశాఖ అధికారులు రైతులకు విస్తృతస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 15 పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 1186 మంది రైతుల ద్వారా 7951 మెట్రిక్ టన్నుల పత్తి కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు 39 మంది రైతుల ఖాతాల్లో రూ.89.84లక్షలు జమ చేసినట్లు చెప్పారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు పీఏసీఎస్ ఆధ్వర్యంలో 20, డీసీఎంఎస్ 7, ఐకేపీ ఆధ్వర్యంలో 3 మొత్తం 30 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 42 మంది రైతుల ఖాతాల్లో రూ.57.73 వేలు జమ చేయడం జరిగిందని తెలిపారు. ఇంకా 9 కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉందని పేర్కొన్నారు. ఏఈవోలు ప్రతి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నాణ్యతా ప్రమాణాను గుర్తించాలని సూచించారు. గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వెంటవెంటనే ధాన్యం కొనుగోళ్లు జరపాలని, సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు నిర్దేశిత రైస్ మిల్లులకు తరలించాలని, ట్యాబ్ ఎంట్రీలు త్వరగా చేయాలని సూచించారు. అన్ని రకాల రిజిస్టర్‌లను సక్రమంగా నిర్వహించాలన్నారు. సమగ్ర ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ప్రతి ఎన్యూమరేటర్ తమ పరిధిలోని ఏ ఒక్క ఇంటినీ విడిచి పెట్టకుండా సర్వే నిర్వహించాలని సూచించారు. సర్వే నిర్వహిస్తున్న సమయంలో ఎలాంటి తప్పిదాలకు తావివ్వకుండా సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, డీపీవో సురేశ్‌మోహన్, సీపీవో సౌమ్య, డీఆర్డీ పీడీ శ్రీలత, సివిల్ సప్లై అధికారులు శ్రీనివాస్, గోపీకృష్ణ, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి రియాజుద్దీన్, జిల్లా వైద్య ఆరోగ్యధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, జిల్లా అధికారులున్నారు.

**మైనర్ బాలిక కిడ్నాప్, లైంగికదాడి**

## నిందితుడికి 20 ఏండ్ల జైలు శిక్ష

చేవెళ్లటౌన్, నవంబర్ 13 : మైనర్ బాలికను కిడ్నాప్ చేసి లైంగికదాడి చేసిన నిందితుడికి పోక్సో చట్టం కింద 20 ఏండ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ ఎల్‌బీనగర్ కోర్టు న్యాయమూర్తి హరీష తీర్పునిచ్చారు. చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. 2017లో వికారాబాద్ జిల్లాలోని పూడూరు మండల పరిధిలోని బాకాపూర్ గ్రామానికి చెందిన వడ్డె ప్రకాశ్(27)వృత్తిరీత్యా డ్రైవర్. ఈ క్రమంలో ఓ మైనర్ బాలికను కిడ్నాప్ చేసి లైంగికదాడి చేశాడని చేవెళ్ల పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు రావడంతో పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి కోర్టులో కేసు విచారణ కొనసాగుతున్నది. ఈ కేసుపై బుధవారం ఎల్‌బీనగర్ కోర్టులో వాదోపవాదాలు జరిగాయి. నిందితుడు బాలికను కిడ్నాప్ చేయడంతోపాటు లైంగికదాడికి పాల్పడినట్లు రుజువైంది. దీంతో పోక్సోచట్టం కింద నిందితుడు వడ్డె ప్రకాశ్‌కు 20 ఏండ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.25వేల జరిమానా విధిస్తూ కోర్టు న్యాయమూర్తి హరీష తీర్పునిచ్చారని చేవెళ్ల సీఐ తెలిపారు.

## కుటుంబసభ్యులకు తప్పిపోయిన వ్యక్తి అప్పగింత



మంగేష్కర్ ఠాగూర్(ఫైల్)

దోమ, నవంబర్ 13 : మతిస్థిమితం కోల్పోయి తప్పిపోయి వచ్చిన వ్యక్తిని ఆయన కుటుంబసభ్యులకు అప్పగించిన ఘటన దోమ మండల పరిధిలోని దాదాపూర్ గ్రామంలో జరిగింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన మంగేష్కర్ ఠాగూర్ అనే వ్యక్తి మానసిక రుగ్మతతో బాధపడుతున్నాడు. ఠాగూర్ తొమ్మిది నెలల క్రితం తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూరు నగరంలో ఓ ఉత్సవానికి కుటుంబసభ్యులతో వచ్చి తప్పిపోయాడు.అప్పటి నుంచి తిరిగి ఇంటికి వెళ్లలేని పరిస్థితిలో తిరుగుతూ తిరుగుతూ మంగళవారం రాత్రి సమయంలో దాదాపూర్ గ్రామానికి వచ్చాడు. అనుమానాస్పదంగా అటూ ఇటూ తిరుగుతున్న ఆ వ్యక్తిని దాదాపూర్ గ్రామ యువకులు ప్రశ్నించగా.. రాష్ట్రం, ఊరు పేరు మాత్రమే చెప్పడంతో చాలా మంది వ్యక్తులతో మాట్లాడి అడ్రస్ తెలుసుకునే ప్రయత్నం చేశారు. చివరగా ఒక ట్రావెల్ ఏజెన్సీ వ్యక్తి ద్వారా ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ జిల్లా డీఎస్పీ కార్యాలయంలో పనిచేస్తున్న విశాల్ ఠాగూర్‌గా బాధితుడి అన్నగా నిర్ధారించుకున్నారు. అనంతరం అతడితో మాట్లాడి జిల్లా పోలీసు అధికారి సమక్షంలో మంగేష్కర్ ఠాగూర్‌ను ఆయన అన్నకు అప్పగించారు. వీరి ప్రత్యేక ఆదరణను గుర్తించిన డీఎస్పీ కార్యాలయ సిబ్బంది, బాధితుడి అన్న విశాల్ ఠాగూర్ దాదాపూర్ గ్రామ ఉప సర్పంచ్ అబ్దుల్ గఫార్, యువకులు సద్దాం, జశ్వంత్‌లను సన్మానించి రూ.10వేల పారితోషకం అందజేశారు.

## మెరుగైన వైద్య సేవలందించాలి

**వికారాబాద్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ**

పెద్దేముల్, నవంబర్ 13 : ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులు, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ మెరుగైన వైద్య సేవలను అందించాలని వికారాబాద్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి గదులు, సిబ్బంది పనితీరును, హాజరును, రికార్డులను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలని.. విధుల పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 3070 మంది బీపీ,1624 మంది డయాబెటిస్ రోగులకు కాంబినేషన్ డ్రగ్స్‌ను క్రమం తప్పకుండా ఇస్తున్నామన్నారు. కొనసాగుతున్న ఎంసీహెచ్, ఎన్‌సీడీ, డ్రై-డే-ఫ్రైడే, టీబీ, ఎన్‌క్వాస్, ఏఎన్‌సీ, ఇమ్యునైజేషన్.. అదే విధంగా చలికాలాన్ని దృష్టిలో ఉంచుకొని అన్ని రకాల ఆరోగ్య జాగ్రత్తలను ముందస్తుగా తీసుకుంటున్నామన్నారు. ఆసుపత్రిలో 170 రకాల మందులు అందుబాటులో ఉన్నాయని, వైద్య సిబ్బంది ప్రతిఒక్కరూ విధుల్లో ఉన్నారని.. కుక్క కాటుకు సంబంధించిన 50 డోసులు, పాము కాటుకు సంబంధించిన 20 డోసుల ఇంజెక్షన్లు పీహెచ్‌సీలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి రోజూ ఆసుపత్రికి ఓపీలో 120 మంది రోగులు వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారని తెలిపారు.మెడికల్ ల్యాబ్‌లో అన్ని రకాల వైద్య పరీక్షల నమూనాలను సేకరించి జిల్లా కేంద్రానికి పంపుతున్నామని పేర్కొన్నారు. అన్ని రకాల పారామీటర్స్‌తో మెయింటేన్ చేస్తూ ఆసుపత్రిని కొనసాగించబడుతున్నదన్నారు.

ఈ సందర్భంగా డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పాత భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో దానిని కూల్చివేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి తాండూరు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులకు సమాచారం ఇచ్చి వీలైనంత త్వరగా పాత పీహెచ్‌సీ భవనాన్ని కూల్చివేస్తామని.. అందుకు సంబంధిత అధికారులతో మాట్లాడడం కూడా జరిగిందన్నారు. నూతన పీహెచ్‌సీ భవనం ఇంకా హ్యాండోవర్, టేక్ఓవర్ కాలేదని అయిన వెంటనే పీహెచ్‌సీలో సంపూర్ణంగా ఫర్నిచర్‌ను కూడా సమకూర్చి ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలను అందించడానికి కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీఐవో, డీడీవో డాక్టర్ బుచ్చిబాబు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటసాయి, పంచాయతీరాజ్ డీఈ నాగభూషణం, ఏఈలు పాల్గొన్నారు.



పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ

### రోగుల పట్ల నిర్లక్ష్యం తగదు

**ధారూరు :** రోగుల పట్ల ఏమాత్రం నిర్లక్ష్యం వహించకుండా అన్ని రకాల సేవలు సకాలంలో అందించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను డాక్టర్ వెంకటరమణ ఆదేశించారు. బుధవారం ధారూరులోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించి, ఆసుపత్రిలోని మందుల నిలువ ఉన్న గదిని, వ్యాక్సిన్ నిలువ గది, రిఫ్రిజిరేటర్లను పరిశీలించారు. అనంతరం మండల పరిధిలోని ధారూరు మెథడిస్టు క్రిస్టియన్ జాతరను సందర్శించారు. ఆరోగ్య శిబిరాన్ని పరిశీలించి భక్తులకు సరైన చికిత్సనందించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, తాగునీరు, తినుబండారాల గురించి జాగ్రత్తలు తీసుకునేలా భక్తులకు అవగాహన కల్పించాలన్నారు. క్యాంపులో అందుబాటులో ఉన్న మందులను పరిశీలించి సిబ్బంది వారికి కేటాయించిన షిఫ్ట్‌ల ప్రకారం విధులు నిర్వహించాలని ఆదేశించారు.

## హై టెన్షన్ విద్యుత్ స్తంభాల మళ్లింపు అడ్డగింత

- పోలీసుల రంగప్రవేశంతో స్తంభాల ఏర్పాటు
- రాష్ట్రంలో పోలీసుల పాలన నడుస్తున్నదని ఆవేదన వ్యక్తం చేసిన కాలనీవాసులు



33 కేవీ లైన్‌ను మళ్లించకుండా వాహనం కింద పడుకున్న మహిళ

తుర్కయాంజాల్, నవంబర్ 13 : హై టెన్షన్ విద్యుత్ స్తంభాల షిఫ్టింగ్‌ను కాలనీవాసులు అడ్డుకున్న సంఘటన తుర్కయాంజాల్ మున్సిపాలిటి పరిధి రాగన్నగూడ శ్రీగణేష్‌నగర్ కాలనీలో జరిగింది. బుధవారం మున్సిపాలిటీ పరిధి రాగన్నగూడ రంగాపురం కాలనీ నుంచి శ్రీగణేష్‌నగర్ కాలనీకి 33 కేవీ లైన్ మళ్లింపు కోసం హై టెన్షన్ విద్యుత్ స్తంభాలను సిబ్బంది ఏర్పాటు చేస్తున్నారు. దీంతో కాంట్రాక్టర్ పనులు చేయకుండా పలువురు మహిళలు వాహనాలకు అడ్డుగా పడుకొని పనులను ఆపడానికి ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి కాలనీవాసులు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో వాగ్వాదం నెలకొన్నది. తమ ఇండ్ల ఎదుట 33 కేవీ విద్యుత్ లైన్ వేయడం ద్వారా పిల్లలు రోగాల బారిన పడుతారని.. భవిష్యత్తులో తాము పై అంతస్తు నిర్మాణం చేపట్టాలంటే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని కాలనీవాసులు పోలీసులకు వివరించారు. అయితే పోలీసులు మాత్రం మున్సిపల్ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు హై టెన్షన్ లైన్ ఏర్పాటుకు అనుమతి ఇచ్చారని పనులను అడ్డుకోవద్దని కాలనీవాసులకు తెలియజేశారు. దీంతో ఓ మహిళ విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్న వాహనం కింద పడుకొని పనులను అడ్డగించే ప్రయత్నం చేసింది. దీంతో మహిళా పోలీసులు ఆ మహిళను పక్కకు లాగడంతో పాటు ఇతర మహిళలను అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వం చేస్తున్న పనులను అడ్డుకోవడం సరైనది కాదని.. సమస్య ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి కాలనీవాసులకు సూచించారు. పోలీసుల సమక్షంలో కాంట్రాక్టర్ విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయడంతో చేసేదేమీలేక కాలనీవాసులు వెనుదిగారు. రాష్ట్రంలో పోలీసుల పాలన సాగుతున్నదని.. సామాన్యులకు న్యాయం జరిగే అవకాశం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు.

## ఎంబీఏ (టీఎం), ఎంబీఏ (ఈవినింగ్) ప్రవేశాల గడువు పొడిగింపు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 13: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్), ఎంబీఏ (ఈవినింగ్) కోర్సుల్లో ప్రవేశాలకు గడువును పొడగించినట్టు ఓయూ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఐ.పాండురంగారెడ్డి తెలిపారు. ఓయూ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం సెమిస్టర్ విధానంలో అందజేసే ఈ కోర్సుల్లో చేరేందుకు ప్రవేశ పరీక్షకు హాజరవ్వాల్సి ఉంటుందని, పరీక్షకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు చెప్పారు. తమ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాలను డౌన్‌లోడ్ చేసుకొని, పూర్తిగా నింపి, రూ.500 అపరాధ రుసుముతో సహా నియమిత రుసుమును ఈ నెల 22 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. పరీక్షను ఈ నెల 24న నిర్వహిస్తామని తెలిపారు. పై రెండు కోర్సులూ ఈవినింగ్ కోర్సులేనని చెప్పారు. ఈ కోర్సుల వ్యవధి రెండేళ్లని పేర్కొన్నారు. టీఎస్ ఐసెట్-2024లో అర్హత సాధించినవారు పరీక్ష రాయాల్సిన అవసరం లేదని, వారు దరఖాస్తు సమర్పించి, నేరుగా కౌన్సిలింగ్‌కు హాజరుకావచ్చని వివరించారు. రెండు కోర్సులకూ డిగ్రీ పూర్తి చేసి రెండేళ్లు ఎగ్జిక్యూటివ్ కేడర్‌లో విధులు నిర్వర్తించిన అనుభవం తప్పనిసరని తెలిపారు.

## ఎంపీఈడీ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 13: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంపీఈడీ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీఈడీ మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును ఈ నెల 18 లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 20వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్టు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చన్నారు.

## అనుమానాస్పద స్థితిలో నవవధువు ఆత్మహత్య

బండ్లగూడ, నవంబర్ 13 : అనుమానాస్పద స్థితిలో నవ వధువు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ వెంకటరామిరెడ్డి కథనం ప్రకారం.. కామారెడ్డి మద్నూర్‌కు చెందిన సిద్ధేశ్వరి వివాహం ఏడు నెలల కిందట అత్తాపూర్ రాంబాగ్ చెందిన ప్రవీణ్‌తో జరిగింది. ప్రవీణ్ ఒక బంగారం దుకాణంలో పనిచేస్తుండగా.. సిద్ధేశ్వరి ఇంట్లోనే ఉంటున్నది. మంగళవారం సాయంత్రం భర్త ప్రవీణ్‌తో ఫోన్‌లో మాట్లాడిన ఆమె.. ఆ తర్వాత ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ప్రవీణ్ అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని, తన కూతురు ఆత్మహత్యకు అతడే కారణమంటూ సిద్ధేశ్వరి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.